**'ప్రతిరాత్రీ ప్రతిమపాడే జోలపాట మా హృదయాలను కదల్చివేస్తుంది"**


# రామ శ్రీరామలాలీ....

మాచర్ల హేమ

ఊరంతా గాఢ నిద్రలో వుంది. వెన్నెల పిండారబోసినట్లుంది. వేసవి కాలమే మో మధ్యాహ్నపు సూర్యుడి తీక్షణ కిరణాలకు తాళలేక సొమ్మసిల్లిన ప్రకృతి మెల్లిగా వీచే చల్లగాలికి సేద తీర్చుకుంటున్నట్లుంది.

బాదం చెటుకూ. కొబ్బరి చెట్టుకూ మధ్య మంచం వేసుకుని వెన్నెల అందాన్ని, చిరుగాలి చల్లదనాన్ని, కొబ్బరాకుల సవ్వడినీ ఆస్వాదిస్తూ పడు కున్నాను. ఆ నిశ్శబ్దంలోని ఆకుల సంగీతం, వెన్నెల తెల్లదనం. సన్నని మేలిముసుగులోంచి కన్పించే అందం లాంటి ప్రకృతిని చూడకుండా నిద్ర పోవాలనిపించడంలేదు.

ఉన్నట్లుండి దూరంగా, సన్నగా "రామ శ్రీరామలాలీ మాపాలి సీతాసమేత లాలీ"- లాలి పాట విన్పించ సాగింది. అంత వెన్నెల హాయిలోనూ నా మనసులో ఏదో సన్నని బాధ. ఆ పాట దాదాపు నాలుగేళ్ళ నుంచీ ప్రతిమ నోటినుంచి రాత్రి ఏదో



సమయంలో వినడం అలవాటైంది నాకు. విన్నప్పుడల్లా ఏదో తెలియని బాధలాంటిది మనసులో.

ప్రతిమ చిన్నప్పుడే తండ్రి చనిపోవ డంతో ప్రతిమ తల్లి కౌసల్య పుట్టింటికి వచ్చేసింది. వాళ్ళు వచ్చిన తర్వాత దాదాపు మూడేళ్ళకు కౌసల్య తండ్రికూడా చనిపోవడంతో ఒంటరిదైపోయిన కౌసల్య పుట్టెడు దుఃఖాన్ని మనసులోనే అదిమిపెట్టి నాలుగెకరాల తండ్రి పొలం కౌలుకిచ్చి ఆ వచ్చిన తిండిగింజలతో నాలుగేళ్ళ ప్రతిమలోనే ఆశలన్నీ నింపు కుని జీవించసాగింది. కాని ప్రతిమకు వయసొచ్చినకొద్దీ శరీరం ఎదిగినంతగా మనసు ఎదగలేకపోయింది. స్కూల్లో చేర్పించినా ఒక్క అక్షరంకూడా నేర్చుకో లేకపోయింది.

ఎప్పుడూ తనలో తను మాట్లాడుకోవ డం, నవ్వుకోవడం చేసేది. ఒకదాని కొకటి సంబంధం లేని అర్థంకాని మాటలు మాట్లాడేది. కాని ఎవరైనా తననేమన్నా అంటే మాత్రం ఊరుకునేది కాదు. ఒక సారి ప్రతిమ ఏడేళ్ళపిల్లగా ఉన్నప్పుడు వాళ్ళపక్కయింటిపద్మ తమ్ముడురెండేళ్ళ పిల్లవాడి దగ్గరున్న గిలకలాంటిది కానివ్వ మని తల్లిని వేధిస్తే తన కూతురు తెలివి

తక్కువకు నవ్వాలో ఏడవాలో తెలియక
విసుగులో ఒక దెబ్బ వేసింది. దాంతో
రెచ్చిపోయిన ప్రతిమ కన్నతల్లి అనైనా
చూడకుండా కాళ్ళతో తన్ని కర్రతో
కొడితే ఆ దెబ్బలకు వారం రోజుల
వరకూ లేవకోలేకపోయింది కౌసల్య.

పుట్టగానే బొమ్మలా, అందంగా ఉన్న
పాపను చూసి మురిసిపోయిన కౌసల్య
"ప్రతిమ" అని పేరు పెట్టుకుంది. కాని
ఊళ్ళో అంతా ప్రతిమను "పిచ్చిపిల్ల"
అనే పిల్చేవాళ్ళు. కౌసల్య నోటనుంచి
"ప్రతిమ" అన్న పిలుపు వింటే తప్ప
ఎవ్వరికీ గుర్తుండేది కాదు. ఆ పిచ్చిపిల్ల
పేరు "ప్రతిమ" అని.

ప్రతిమకు పద్దెనిమిదేళ్ళొచ్చినా సిగ్గూ
ఎగ్గూ లేకుండా బజార్లో గంతులు వేస్తూ
తిరిగేది. కొంటె పిల్లలు ఆమెను ఎగతాళి
చేసి కొట్టబోతే పారిపోయేవాళ్ళు. ఒక
రోజు మంచినీళ్ళ బావి నుంచి నీళ్ళ బిందె
ఎత్తుకొస్తుంది ప్రతిమ. వెనక నుంచి
ఎవరో హైస్కూలు పిల్లవాడు జడ పట్టుకు
లాగాడని బిందె వాడి మీద ఎత్తి పడ
వేసింది. ఆ దెబ్బకు వాడి నుదుటికి
గాయమై హాస్పిటల్ చుట్టూ తిరగాల్సి
వచ్చింది. అంత వరకూ అమ్మ చెప్పగా
తెలుసు నాకు.

అప్పుడు నేను తొమ్మిదో క్లాస్ చదువు
తున్నాననుకుంటాను. మా అరుగుపైన
నిల్చుని మా యెదురింటి పద్మ పెళ్ళికి
పందిరివేసి తోరణాలు కడ్తుంటే చూస్తున్న
నన్ను పిలిచి అడిగింది ప్రతిమ వాళ్ళింట్లో
ఏం జరుగుతుందని? "పెళ్ళి" అని
చెప్పాను నేను. "అంటే ఏమిటి?" అని
అడిగింది. ఏం చెప్పాలో అర్థంకాని నేను
"అందరూ వస్తారు, బాజా భజంత్రీ
లుంటాయి పద్మకు పట్టు చీరలు, నగలు
పెడ్తారు" అని చెప్పాను.

పద్మ పెళ్ళిరోజు తనను ఎవరూ పిలవ
కున్నా, తల్లి వెళ్ళొద్దని బతిమాలినా విన
కుండా తన ఇంటికీ, పద్మ ఇంటికీ మధ్య
పిట్టగోడమీద కూర్చుని అల్లరిచేయకుండా
పెళ్ళి అంతా ఆసక్తిగా చూసింది. పద్మ
పెళ్ళి అలంకరణ, పట్టు చీరలు, నగలు
ప్రతిమనాకర్షించినై. అప్పటినుంచి రోజూ
తల్లితో పోరుపెట్టేది తనకూ పెళ్ళి చేయ
మని. తనా వేలకు వేలు కట్నం ఇవ్వ
లేదు. పిల్లను చూసైనా ఎవరైనా చేసు
కుంటారా అంటే అదా వెర్రిబాగుల్ది.
తనెలా చేయగలదు? ప్రతిమ పెళ్ళి! తన
అశక్తతకు తనే కుమిలిపోయేది కౌసల్య.
ఊళ్ళో అందరూ పిచ్చిపిల్లకు పెళ్ళిపిచ్చి
పట్టిందని ఎగతాళి చేసేవారు. ఆ మాట
ల్లోని ఎగతాళి అర్థం చేసుకోలేని ప్రతిమ

పాల్ నురుగుల
సైన్యం రావాలి!
మురికిపై దాడిని
చేయాలి!!




మురికి, జిడ్డు, మరకలపై పాల్ నురుగుల దాడి ప్రారంభం కానివ్వండి! పాల్ నురుగుల సైన్యాన్ని రంగంలోకి దిగనివ్వండి!! మురికి జిడ్డు మరకలతో ఇవి కలియబడడం చూడండి. వాటిని సమూలంగా నాశనంచేసి, తళతళలాడే స్వచ్ఛమైన తెల్లని బట్టలు మిగులుతాయి.



మురికిని నాశనంచేసే కోట్లాది నురుగుల బుడగలు యిముడ్చుకున్నదే—పాల్ డిటర్జెంటు బిళ్ళ.

ఉత్పత్తిదారులు:
అల్ట్రా మరైన్ అండ్
పిగ్మెంట్సు లిమిటెడ్
రాణిపేట, తమిళనాడు

Sista's UPL-25A-81.Tel

"మా అమ్మ నాకు పెళ్ళి చేయడం లేదు చూడు" అంటూ ఫిర్యాదు చేసేది. "ఎవడో పిచ్చివాడు దొరికితే అందరం కలిసి ముడి పెడతాములే" అనే వారి మాటలకు ప్రతిమ ఎంతో సంబరపడిపోయేది. ఆ పిచ్చిపిల్ల అమాయకత్వానికి కొందరు ఎగతాళి చేసేవారు. మరికొందరు నవ్వుకునేవారు. చాలా తక్కువమంది జాలి పడేవారు. అదంతా కౌసల్యకు తెలిసినా తన దురదృష్టానికి చింతించడం తప్ప నోరు విప్పి ఎవరినీ ఏమీ అనలేక పోయేది.

తమాషాగా అన్న ఊరివాళ్ళ మాటలు ఒక రోజు నిజమే అయ్యాయి. ఆ రోజు మాసిన బట్టలు, చింపిరి తల, పొడుగాటి గడ్డంతో ఉన్న ఒక వ్యక్తిని మా స్కూల్ ప్యూన్ వెంట బెట్టుకుని మా క్లాస్ రూం లోనికి తీసుకొచ్చాడు. అతడి పేరు రామశర్మ అని, అతడి ఇల్లు దురదృష్టవశాత్తూ అగ్నికి ఆహుతి అయిందని, ఇంటితో పాటు తలిదండ్రులూ చనిపోయేరని, ఆస్తి పాస్తూలు లేవని, ఇప్పుడు నిలువ నీడ కూడా లేదని, చదువు సంధ్యలు లేవని తనకు తాను వివరాలు చెప్పుకుని మీవద్ద ఎక్కువ డబ్బు లుండవని తెల్సు-అయినా విధిలేక మీ సహాయాన్నర్థిస్తున్నాను అని రెండు చేతులూ జోడించి విన్నవించుకున్నాడు. దీనవదనంతో. హీనస్వరంతో. మేమంతా మా వద్ద బతాసిలు కొనుక్కోడానికి అమ్మనడుక్కున్న డబ్బుల్లోంచి తోచినంత ఇచ్చాము.

నేను మధ్యాహ్నం లంచ్ అవర్‌లో స్కూలు నుంచి ఇంటికి కొచ్చేసరికి మా తాతయ్య ప్రక్కనే కూర్చుని భోజనం చేస్తున్నాడా రామశర్మ. మా అమ్మ వడ్డన చేస్తుంటే. మా నాయనమ్మ కుశల ప్రశ్నలు వేయసాగింది. ముందు అతడి దీనగాథ విని బోలెడంత జాలిపడి "అయితే నాయనా ! నీ కెన్నేళ్ళుంటాయి ?" అని అడిగింది. అతడు "ముప్ఫైరెండు" అన్నాడు. "అయ్యో రామశర్మా ! ఇంకా పెళ్ళి పెటాకులూ కాలేదా ? బ్రహ్మచారి ముదిరినా. బెండకాయ ముదిరినా అనే సామెత తెలీదా ?" అంది సానుభూతిగా మా నాయనమ్మ. "మరి యెలాగండీ బామ్మగారూ ! నాకే తిండీ, టికానా లేనివాణ్ణి. ఇక పెళ్ళానికేం పెట్టి పోషించను"? అన్నాడు "చూడునాయనా మాకుతెల్సిన బంగారంలాంటి పిల్లవుంది. కాస్త అమాయకం అనుకో, అయినా చక్కదనాల చుక్క. నీవు ఊc అంటే చాలు నీకీ ఊరూరూ తిరగడం తప్పి హాయిగా యిక్కడే వుండొచ్చు" అంటూ ప్రతిమ గురించి, ఆమె తల్లి గురించి అంతా చెప్పింది మా నాయనమ్మ అంతా విన్న రామశర్మ ముఖం దివిటీలా వెలిగింది. "ఎంత చల్లనిమాట చెప్పారు బామ్మగారూ ! కడుపులో చల్ల కదలకుండా కూర్చొమంటే కూర్చొనూ" అన్నాడతను.

ఆ రోజే ప్రతిమ తల్లిని పిలిపించి విషయం వివరించింది మా నాయనమ్మ. కౌసల్య ఆనందానికవధుల్లేవు. మా తాతయ్యతో మంచి ముహూర్తం నిర్ణయించి మరో వారం రోజులకు అందరూ కలిసి గోపాలస్వామివారి కోవెలలో ప్రతిమకూ, రామశర్మకూ అక్షింతలు వేసి దీవించారు. మొదట్లో ప్రతిమ రామశర్మను చూసి "బూచాడులా" ఉన్నాడంది. కాని పెళ్ళి అనగానే సంబరపడింది. పెళ్ళిలో అంతా ప్రతిమ తలవంచుకుని అచ్చం పెళ్ళినాడు పద్మలాగే కూర్చుంది. పెళ్ళి అలంకరణలో అందంగా అప్సరసలా ఉన్న ప్రతిమను చూసి అందరూ అసలామె "పిచ్చిపిల్ల" అన్న సంగతే మర్చిపోయారు. కౌసల్య తన పెళ్ళినాటి రెండు వరసల గొలుసూ, పట్టుచీరా ధరించిన ప్రతిమలో ఆనాటి తనను చూసుకుంది. అవి ధరించిన ప్రతిమ తన కోరిక ఇన్నాళ్ళకు నెరవేరినందుకు సంబరపడింది.

దాదాపు మూడు నెలలు చాలా ఆనందంగా, పిచ్చి పనులు చేయకుండా, పెద్దగా అరవకుండా మామూలుగా అందరు క్రొత్త పెళ్ళి కూతుళ్ళ లాగే ఉంది ప్రతిమ. అందరూ హఠాత్తుగా మారిపోయిన ప్రతిమను చూసి పెళ్ళయింతర్వాత పిచ్చి తగ్గిందన్నారు. తన కూతురు పూర్తిగా మారిందని అందరిలో చెప్పుకుని మురిసి పోయేది కౌసల్య.

ఏ పుట్టలో ఏ పాముంటుందో తెలియనట్లు, ఏ మనసులో ఏ ఆలోచనలుంటాయో ఎవరు పసిగట్టగలరు ? ఒకరోజు రామశర్మ ప్రతిమ గొలుసు, కౌసల్య రాబోయే పండుగ కోసం సగం ధాన్యం అమ్మి కూతురికీ, అల్లుడికీ బట్టల కోసం దాచిన డబ్బు రెండు వందలతో సహా మాయమయ్యాడు.

అతడు వెళ్ళిపోయిన మరుక్షణంనుంచి ఊళ్ళో వాళ్ళ హేళనలకో మరెందుకోగాని తగ్గిందనుకున్న ప్రతిమ పిచ్చి మరీ ఎక్కువైపోయింది. బటలుచింపుకోవడం గోడలతో మాట్లాడటం, పెద్దగా ఏడ్వడం చేసేది. ఒక రోజు మా నాయనమ్మ దగ్గరి కొచ్చి "నా మొగుణ్ణి ఎక్కడికి పంపించావని" అడిగింది. అల్లుడలా వెళ్ళిపోవడం కన్నా ఎక్కువగా ప్రతిమ పరిసితి మరింత క్రుంగదీసింది కౌసల్యను. వీళ్ళ పరిస్థితికి ఒకరిద్దరు జాలిపడి రామశర్మ మరో ఊళ్ళో ఏదో స్కూల్లో తన వెనకటి గాథనే బాధగా చెప్పుకుంటుండగా పటుకుని తీసుకొచ్చి మళ్ళీ ఈసారి ఇలా మాయమయితే ఎక్కడున్నా సరే వెతికి దేహశుద్ధి చేస్తామని ఇప్పుడు ప్రతిమ మొహం చూసి వదిలేస్తున్నామని గట్టిగా వార్నింగిచ్చి వెళ్ళారు. రామశర్మ పట్టుకెళ్ళిన గొలుసూ, డబ్బు గురించి తనేమీ అడగననీ, మళ్ళీ వెళ్ళకుండా తనింట్లో వుంటే చాలుననీ ప్రాధేయపడింది కౌసల్య. అతడిని చూడగానే పరుగెత్తు కొచ్చిన ప్రతిమ తనతో చెప్పకుండా ఎందుకు వెళ్ళావని కన్నీటి కళ్ళతో ప్రశ్నించింది.

ఉన్న మూడు రోజులూ రామశర్మ కౌసల్యనూ, ప్రతిమనూ తనను మోసం చేశారని తిట్టి పోస్తూనే వున్నాడు. తననెవరైనా ఒక్క మాటన్నా సహించలేని ప్రతిమ రామశర్మ తిట్లకు నోరు మెదపలేదు. కాని ఆ రోజు "నీలాంటి పిచ్చిదాన్ని పెళ్లి చేసుకుని నా జీవితం నాశనం చేసుకున్నా" నని అంటే మాత్రం సహించలేకపోయింది ప్రతిమ. ఎంత మంది తనను "పిచ్చిదాని"వన్నా ఓర్చు

తారల ఫొటోలు
శ్రీదేవి.., జయసుధ.., జయప్రద.., జయమాలిని, సుజాత.., మాధవి.., ప్రభ.., కవిత.., ఏయన్నార్, ఎన్టీఆర్.., శోభన్‌బాబు.., కృష్ణ.., కృష్ణంరాజు, మోహన్‌బాబు.., కమలహాసన్.. చిరంజీవి!
వీరిలో ఎవరి ఫొటో కావాలన్నా ఫొటోకి 3 రూ॥లు. ఎం.ఓ. చేయాలి....!
ఫొటోతోపాటు సినీతారల అడ్రసులున్న పుస్తకం కూడా పంపబడును!
ఎవరి ఫొటో కావాలో వ్రాయడం మరువకండి!
వై.కె.మూర్తి.
దాసరివారి వీధి * విజయవాడ-2.

పవిత్ర రుద్రాక్ష
1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపు పచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్టమైన రాళ్ళు లభించును. కోరినవారికి ధరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.
Shree Jagdamba Bhawan
(A. J.) SONEPAT-131001.

కౌగలిగింది కాని, తను మనసారా ప్రేమించిన రామశర్మ నోటినుంచి ఆ మాట విని భరించలేక పోయింది. ఏమీ మాట్లాడకుండా రామశర్మ దగ్గరగా వెళ్ళి అతడి లాల్చీ గల్లా పట్టుకుని బయటివరకూ లాక్కొచ్చి "వెళ్ళిపో" అని గట్టిగా అరిచి ధడాల్న తలుపు వేసుకుని వెక్కి వెక్కి ఏడ్చింది ప్రతిమ. ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న రామశర్మ సంతోషంగా వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ఎంత మంది నచ్చచెప్పినా రామశర్మను వెతకడానికి ఒప్పుకోలేదు ప్రతిమ.

ఆ సంఘటన జరిగిన తర్వాత మళ్ళీ పిచ్చెక్కుతుందనుకున్నారు అందరూ. కాని ఒకేసారిగా ఎంతో ఎదిగినట్లుగా, అప్పుడే బాల్యం విడిపోయినట్లుగా బయటి ప్రపంచం అర్థం కాసాగిందామెకు. ఎప్పుడూ ఏవో ఆలోచిస్తూ ఒంటరిగా కూర్చుని, ఎవరు మాట్లాడించినా పలకని ప్రతిమ గురుకు వచ్చిన వెనకటి జన్మను పునరావలోకనం చేసుకుంటున్నట్లుగా వుండేది. ఆకలీ తెలిసేదికాదు, దాహమూ తెలిసేదికాదు. తల్లి పిలిచి అన్నంపెడితే తినేది లేకుంటే లేదు. యోగినిలాంటి ప్రతిమను చూసి కుమిలిపోయేది కౌసల్య.

ఒక రోజు పద్మకు కొడుకు పుట్టాడని ఊరందర్నీ పిలిచి బారసాల జరుపుకున్నారు. తనూ వెళ్తానంది ప్రతిమ. కాస్త మనుషుల్లో తిరిగితేనయినా ఆమెలో ఏమైనా చైతన్యం వస్తుందేమోనని వద్దనలేదు కౌసల్య.

పద్మకొడుకు బారసాల వేడుకంతా ఆసక్తిగా చూసింది ప్రతిమ. చిన్నారిబాబు నెత్తుకుని గర్వంగా భర్త ప్రక్కన కూర్చున్న పద్మను చూసిన ప్రతిమకు "అలాంటి క్షణాలు స్త్రీ జీవితంలో అపురూప వరాలు" అనె విషయం అర్థం కాసాగింది. అంతా మౌనంగా తిలకించి ఇంటికి రాగానే ఆమె కౌసల్య నడిగింది ఒకే మాట: "అమ్మా నాకు చిన్నపాప పుటదు కదూ?" అని. ప్రతిమను దగ్గరికి తీసుకుని వెక్కి వెక్కి ఏడ్చింది కౌసల్య. ఆ రాత్రి పద్మ ఇంట్లో పేరంటాళ్ళు పాడిన జోలపాట "రామ శ్రీరామ లాలీ! మా పాలి సీతా సమేత లాలీ" అంటూ దిండును జోకొడుతూ మెల్లిగా పాడుకుంటున్న ప్రతిమను చూసి నిర్లిప్తంగా నవ్వుకుంది కౌసల్య.

ఇది జరిగి నాలుగేళ్ళయినా ఇప్పటికీ ప్రతి రాత్రి ప్రతిమ పాడే జోల పాట మా ఊర్లో అందరి హృదయాలనూ కలచివేస్తుంది. ❊

